క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న ఆదర్శ్ కుటుంబ సభ్యులు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామానికి చెందిన జనసేన అభిమాని ఆదిమూలం హరిప్రసాద్ కుమారుడు ఆదిమూలం సత్య ఆదర్శ్ పుట్టినరోజు పురస్కరించుకుని ఆదివారం మొగలికుదురు శ్రీసత్యసాయి భరోసా దీన జనోద్ధరణ కేంద్రంలో వృద్ధులు, అనాథలకు నిత్యావసరాలు, కిరాణా, కూరగాయలు, బియ్యం పంపిణీ చేశారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు ద్వారా వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఆదర్శ్ కుటుంబ సభ్యులు, పంచదార చినబాబు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో జిల్లా జడ్జి నాగేశ్వరరావు



విఘ్నేశ్వరుని సన్నిధిలో రాజమహేంద్రవరం జిల్లా జడ్జి నాగేశ్వరరావు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని రాజమహేంద్రవరం జిల్లా జడ్జి నాగేశ్వరరావు ఆదివారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వాదం పలికి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఏఎంసీలో స్థానంపై హర్షం



ఎమ్మెల్యే రాపాకకు కృతజ్ఞతలు తెలుపుతున్న కేశనపల్లి నాయకులు

మలికిపురం: రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కేశనపల్లి గ్రామానికి స్థానం కల్పించడంపై గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కత్తిమండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావుకు పుష్ప గుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి చెందిన సుంకర బాబ్జికి ఏఎంసీలో ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యెనుముల నారాయణస్వామి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సుంకర బాబ్జి, నాయకులు యర్రంశెట్టి కృష్ణ, గుబ్బల మనోహర్, గోగన్నమఠం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మలికిపురం: పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతిని మండలంలోని కేశనపల్లిలో ఆదివారం నిర్వహించారు. మండల బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమర్పణ దివస్ కోసం సేకరించిన నగదును కూడా నాయకులు పార్టీ కేంద్ర కార్యాలయ అకౌంట్‌కు పంపారు. మండల పార్టీ అధ్యక్షుడు కాపిశెట్టి కనికేశ్వరరావు, అడబాల రాంబాబు, అడబాల యేసుబాబు, కంచి నాగేశ్వరరావు, అనిశెట్టి బాలాజీ రాయుడు, అడబాల వెంకట నరసింహారావు తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణం



వీరభద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న గోపీనాథ్ దంపతులు

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువు దీరిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. శిరిగినీడి గోపీనాథ్–హేమజ్యోతి దంపతులు కర్తలుగా పాల్గొని స్వామి కల్యాణాన్ని రమణీయంగా జరిపించారు. వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. డప్పు వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ కల్యాణం ఆద్యంతం వైభవంగా జరిగింది. పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఖర్చు తగ్గించి.. దిగుబడి పెంచేలా..

- పొలంబడితో రైతుల చెంతకు అధికారులు
- క్షేత్రస్థాయిలో సాగులో సూచనలు



వ్యాఘ్రేశ్వరంలో వరి సాగుపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏడీఏ, వ్యవసాయాధికారులు (ఫైల్)

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు వైఎస్సార్ పొలంబడి కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వ్యవసాయాధికారులతో పాటు గ్రామ సచివాలయాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను కూడా భాగస్వాములు చేస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించనున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో అంబాజీపేటలో 16, పి.గన్నవరంలో 20, అయినవిల్లిలో 21, మామిడికుదరులో 18, రాజోలు నియోజకవర్గంలో రాజోలు 16, మల్కిపురం 21, సఖినేటిపల్లి 16, కొత్తపేట నియోజకవర్గంలో కొత్తపేట 10, రావులపాలెం 12, ఆలమూరు 18, ఆత్రేయపురం 17 గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 18,682, రాజోలు నియోజకవర్గంలో 1,106, కొత్తపేట నియోజకవర్గంలో 27,114 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

వరితో పాటు ప్రధానమైన అరటి, చెరకు పంటలతో పాటు కూరగాయల పంటలు సాగు చేసిన రైతులకు అందుబాటులో ఉంటూ సాగులో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించడానికి ప్రతి సచివాలయానికి ఒక వ్యవసాయ సహాయకుడిని ప్రభుత్వం నియమించింది. పొలంబడి కార్యక్రమంలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలి. రైతులకు ఎటువంటి సూచనలు ఇవ్వాలి తదితర అంశాలపై సంబంధిత అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు.

రైతులకు 14 వారాల శిక్షణ

గ్రామంలో వారానికి ఒక రోజు పొలంబడి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వారానికి ఒక రోజు చొప్పున మొత్తం 14 వారాల పాటు రైతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు పొలాలను సందర్శిస్తారు. సాగులో వస్తున్న శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ఎరువులు, పురుగుమందుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. సీజన్ వారీగా తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తారు.

అన్నదాతలకు అవగాహన కల్పించే దిశగా..



గతంతో పోల్చుకుంటే పంటల సాగు వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. దీని వల్ల దిగుబడులు బాగా వచ్చినా లాభాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. సాగులో ఖర్చు తగ్గించడానికి అందుబాటులో ఉన్న పద్ధతులను వివరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి పొలంబడి కార్యక్రమం ద్వారా మెరుగైన వ్యవసాయం చేసేందుకు అవగాహన కల్పిస్తున్నారు.

– బొంతు శ్రీనివాస్, రైతు, ఇసుకపూడి

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం



పొలంబడి కార్యక్రమాల కోసం గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నాం. ఎంపిక చేసిన గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. విత్తనోత్పత్తి, ఎరువులు, పురుగు మందులు, సేంద్రియ పంటలపై అవగాహన కల్పిస్తాం. మిత్ర పురుగుల సంరక్షణ, ప్రకృతి సాగు విస్తీర్ణం పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

– ఎస్‌జేవీ రామమోహనరావు, ఏడీఏ, పి.గన్నవరం

ప్రకృతి సేద్యంతో పైరుకు ఎంతో మేలు

జిల్లా ప్రకృతి వ్యవసాయ ఏడీఏ ఎలియాజర్



ఇరుసుమండలో జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ ఎలియాజర్

అంబాజీపేట: ప్రస్తుత తరుణంలో ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పైరుకు ఎంతో మేలు కలిగి నాణ్యమైన దిగుబడులు లభిస్తాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్, ఏడీఏ జె.ఎలియాజర్ చెప్పారు. ఇరుసుమండ శివారు చిన్నంవారిపేటలో ప్రకృతి వ్యవసాయ పీఆర్పీ జనుపల్లి నాగవేణి అధ్యక్షతన ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం కల్పించారు. ఏడీఏ ఎలియాజర్ మాట్లాడుతూ భూమిలో బ్యాక్టీరియాను పెంచేందుకు ఘన, ద్రవ జీవామృతాలను వినియోగించాలన్నారు. రసాయన ఎరువుల వల్ల నేల సారాన్ని కోల్పోతుందని వాటిని వాడకుండా 18 నుంచి 30 రకాల విత్తనాలను నేలలో చల్లి దుక్కిలో వాటిని కలియదున్నాలన్నారు. విత్తు జల్లే ముందు బీజామృతంతో విత్తనశుద్ధి చేయాలని సూచించారు. ఒక ఎకరానికి జీవామృతం తయారు చేసేందుకు 200 లీటర్ల నీటికి 10 కేజీల బెల్లం, 10 కేజీల శనగపిండి, గోమూత్రం, గోపేడ, పుట్ట మట్టి కలిపి మూడు రోజుల పాటు నిల్వ ఉంచాలన్నారు. ఉదయం, సాయంత్రం సవ్య దిశలోనే జీవామృతాన్ని కలియబెట్టాలన్నారు. దీనిని నీటితో కలిపి పొలాల్లో పారించాలన్నారు. తెగుళ్లు, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, పసుపు రంగు అట్టలు, లింగాకర్షక బుట్టలను వినియోగించాలన్నారు. పిచికారీ చేసేందుకు పుల్లటి మజ్జిగ, వెల్లుల్లి ద్రావణం, కుంకుడు రసం తదితర పదార్థాలను వినియోగించాలన్నారు. ఒడిశాలోని పర్లాకిమిడిలో ఉన్న సెంచూరియన్ యూనివర్శిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న చిన్నం వీణ క్షేత్ర స్థాయి అనుభవం కార్యక్రమంలో భాగంగా ఇరుసుమండలో కషాయాలు, ఘన, ద్రవ, జీవామృతాల తయారీని ప్రయోగాత్మకంగా చేసి రైతులకు వివరించింది. తాను 60 సెంట్లలో పెసర పంట సాగు చేస్తున్నానని సగ భాగానికి ప్రకృతి సేద్యం, మిగిలిన దానిలో రసాయన సేద్యం చేశానన్నారు. ఏ విధమైన చీడపీడలు ఆశించకుండా ప్రకృతి సేద్యంలో నాణ్యమైన ఉత్పత్తులు సాధించినట్లు వివరించారు. రైతులంతా ప్రకృతి సేద్యాన్ని చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు కె.మల్లేశ్వరి, టి.దుర్గాలక్ష్మి, ఎం.దుర్గాభవాని డి.వెంకట నాగమణి, ఎం.సరితా శ్రీలక్ష్మి, కె.అరుణ, రైతులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



పుల్లేటికుర్రులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అంబాజీపేట: నిత్యం పుస్తకాలతో ఉండే విద్యార్థులకు మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని సర్పంచ్ జల్లి బాలరాజు, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్.బాపిరాజులు అన్నారు. పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్‌ఏవీ రాఘవాచార్యులు అధ్యక్షతన క్రీడా పోటీలను ఆదివారం నిర్వహించారు. కరస్పాండెంట్ బాపిరాజు మాట్లాడుతూ అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి, కొత్తపేట మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, షాట్‌పుట్ పోటీలకు 12 పాఠశాలలకు చెందిన 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. పీడీల పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు, పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. అంతకుముందు జాతీయ జెండాను ఎగరవేసి క్రీడా పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో వై.వేణుగోపాలరావు, డి.వెంకటరావు, యు.సుమన్‌రాజు, సీహెచ్ నాగేశ్వరరావు, ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశైలం మల్లన్న పాగా ధూపసేవ



మొగలికుదురులో మల్లన్న పాగా ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: పద్నాలుగు లోకాల్లో మల్లన్న అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ నిర్వహించే శ్రీశైలం మల్లన్న పాగా వార్షిక ధూప సేవా మహోత్సవం మొగలికుదురులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీచౌడేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో కాశిన మల్లికార్జునరావు స్వగృహం నుంచి బాజా భజంత్రీలతో మల్లన్న పాగా ఊరేగింపు ప్రారంభమైంది. భక్తుల కోలాహలం నడుమ పాగా ఊరేగింపును గ్రామ వీధుల్లో ఘనంగా జరిపించారు. స్థానిక భక్తులు మల్లన్న పాగాకు దండలు వేసి ధూపసేవ చేసి ప్రసాదం చెల్లించారు. అనంతరం పాగాను ఊరేగించారు. ఉప్పాడ నుంచి వచ్చిన ఈ తలపాగాను మళ్లీ ఉప్పాడ తీసుకువెళ్తారు. అక్కడి నుంచి శ్రీశైలం తీసుకువెళ్లి మహాశివరాత్రి రోజున లింగోద్భవ సమయంలో శ్రీశైలం మల్లన్న ఆలయ శిఖర మంటపంపై ఉన్న నవ నందులను కలుపుతూ పాగా చుడతారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు కడి శ్రీనివాసరావు, కొండా గాంధీ, కూర్మా బాబి, కారుపర్తి శివ, యక్కల మెహర్, గుమ్మడి భద్రం భక్తులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరునికి రూ.1.32 లక్షల ఆదాయం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయంలో ఆదివారం స్వామి హుండీ లెక్కింపు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరిగింది. రూ.లక్ష 32 వేల ఆదాయం వచ్చిందన్నారు. ప్రత్యేక దర్శనం ద్వారా ఆదాయం రూ.14 వేలు, అన్నప్రసాద విరాళాల ద్వారా రూ.71 వేలు, సేవల ద్వారా రూ.15 వేలు, లడ్డూ, పులిహోర విక్రయాల ద్వారా రూ.24 వేలు విరాళాల ద్వారా ఆదాయం రూ.8 వేలు, మొత్తం రూ.1.32 వేల ఆదాయం వచ్చిందన్నారు.

అరటితోట ధ్వంసం

అంబాజీపేట: రూ.లక్షల పెట్టుబడులు పెట్టి నాటిన అరటి తోటను పందులు స్వైర విహారం చేసి ధ్వంసం చేశాయని గంగలకుర్రు అగ్రహారానికి చెందిన వాసంశెట్టి నాగేశ్వరరావు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశాడు. తరచూ పందులు అరటితోటను నాశనం చేసి అపార నష్టం కలిగిస్తున్నాయన్నారు. ఈ పందుల వల్ల లక్షల్లో నష్టాల పాలై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని నాగేశ్వరరావుతో పాటు పలువురు రైతులు వివరించారు. తక్షణమే పంటలను నాశనం చేస్తున్న పందులను పంచాయతీ అధికారులు స్పందించి అరికట్టి రైతులకు మేలు చేయాలని వారు కోరుతున్నారు.

దాతల ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మెరుగుమువ్వల నాగేశ్వరరావు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. అతనికి ఎన్నారైలు దొండపాటి చిన్న, చెవ్వాకుల మోహన్, గెడ్డం సురేష్, కొల్లాబత్తుల రాజ్ కుమార్, ఓగూరి శ్రీనివాస్, గుబ్బల దుర్గా ప్రసాద్‌లు సమకూర్చిన రూ.10 వేల ఆదివారం ఆర్థిక చేయూత అందించారు. ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు చేతుల మీదుగా కత్తిమండలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద అందించారు. సాయం అందించిన దాతలకు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొడవటి దొరబాబు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కానుబోయిన గోపాలకృష్ణ, కొల్లాబత్తుల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశరావుకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న జైభీమ్ నాయకులు

పి.గన్నవరం: అనారోగ్యంతో బాధపడుతున్న పి.గన్నవరానికి చెందిన సికిలే ప్రకాశరావుకు స్థానిక జైభీమ్ సేవా సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయం ఆదివారం అందించారు. సంఘ అధ్యక్షుడు మోసుగంటి నాగరాజు, కార్యదర్శి బిరుదుగంటి రమేష్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి సంఘ సహకారం అందించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు నాగాబత్తుల చంటి, శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ



చిరతపూడిలో ఫ్రీజర్ స్వీకరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు

అంబాజీపేట: అమెరికాకు చెందిన లూటికుర్తి శేఖర్ ఫ్రీజర్ బాక్స్‌ను వితరణగా చిరతపూడి బైర్రాజు ఫౌండేషన్ కన్వీనర్, రిటైర్డు అడిషనల్ ఎస్పీ ఎల్ ఆర్‌కె మూర్తి, కోకన్వీనర్ ఇళ్ల ఏడుకొండలు ఆదివారం అందజేశారు. శేఖర్ మాట్లాడుతూ సహాయం ఐఎన్‌సీ యూఎస్‌ఏ అనే పేరుతో ఒక ట్రస్టును ఏర్పాటు చేశానన్నారు. ట్రస్ట్ ఫౌండర్‌గా తన తాత స్వగ్రామమైన చిరతపూడి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఉచితంగా ఫ్రీజర్ బాక్స్‌ను అందజేశానన్నారు. దీని వల్ల దహన సంస్కారాలు నిర్వహించుకునేందుకు ఈ బాక్స్ ఉపయోగపడుతుందన్నారు. దీనిని ఉచితంగా ట్రస్ట్ సభ్యులు అందజేస్తారన్నారు. ఇళ్ల ఏడుకొండలు స్వగృహ ఆవరణలో ఈ ఫ్రీజర్ బాక్స్‌తో పాటు మరొకటి ఉందని అవరసమైన వారు వాటిని ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. ఫ్రీజర్ బాక్స్‌ను అందజేసిన శేఖర్‌ను సర్పంచ్ కోట బేబిరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

స్నేహితుడికి రూ.70 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

రాజోలు: వారంతా 1996 ఏడాదిలో పదో తరగతి కలసి చదువుకున్నారు. వారితో కలసి చదువుకున్న స్నేహితుడు రాజేష్‌కు అనారోగ్యంగా ఉందని తెలిసి స్నేహితులంతా ఏకమై రూ.70 వేలు ఆర్థిక సాయం చేశారు. స్నేహితులు జె.రవి, బళ్ల గణపతి, ఉండ్రు బాలకృష్ణ, వాసాల నాగరాజులు స్నేహితుడికి సాయం అందించే విషయం మిగిలిన స్నేహితులతో రాజేష్ అనారోగ్యం పరిస్థితి వివరించారు. స్నేహితులంతా ఆర్థికంగా ఆదుకోవడంపై రాజేష్ స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

జనరంజక బడ్జెట్

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసే విధంగా జనరంజకంగా ఉందని రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర స్వచ్ఛ భారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం అన్నారు. మండలంలోని చొప్పెల్లలో ఆదివారం మండల బీజేపీ శాఖ అధ్యక్షుడు నాగిరెడ్డి స్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. బీజేపీ నాయకులు అయినవిల్లి సత్తిబాబు, కర్రి సీతారామిరెడ్డి, వడ్డి దొరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించకపోతే ఆందోళనకు సిద్ధం



అంతర్వేదికరలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సఖినేటిపల్లి: రాజోలు దీవిలోని సముద్రతీర ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఓఎన్జీసీ సంబంధిత గ్రామాల అభివృద్ధికి సహకరించకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని తీర ప్రాంత గ్రామాల ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం అంతర్వేదికరలో సర్పంచ్ పోతురాజు నరసింహారావు ఇంటి వద్ద ఆయన అధ్యక్షతన ఓఎన్జీసీ కార్యకలాపాలు సాగిస్తున్న గ్రామాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ నరసింహారావు మాట్లాడుతూ, తీరంలో అత్యధిక ఓఎన్జీసీ వెల్స్ ఉన్న గ్రామం అంతర్వేదికర అని, ఇక్కడ అభివృద్ధికి సంస్థ అధికారులకు ఎన్ని వినతి పత్రాలు ఇస్తున్నా కూడా కార్యరూపం దాల్చడం లేదన్నారు. ఈ ప్రాంతాల్లో యువత ఉపాధికి సంస్థ ద్వారా ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలన్నారు. కాగా కరవాక నుంచి అంతర్వేది వరకూ తీరంలోని సహజ వాయువు, చమురు నిక్షేపాలు తరలించుకు వెళుతున్న ఓఎన్జీసీ అభివృద్ధికి తగిన రీతిలో స్పందించడం లేదని సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాగే విద్య, వైద్యం, తాగునీటి సరఫరాకు సంస్థ పెద్దపీట వేసే విధంగా చూడాలని, వాహనాలు తిరుగున్న రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని సమావేశం కోరింది. ప్రతి గ్రామం నుంచి అభివృద్ధికై ఇచ్చిన వినతి పత్రాలు పెండింగ్‌లో ఉండడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని సమావేశం పేర్కొంది. ఇదిలా ఉండగా దశల వారీగా ఆందోళన కార్యక్రమంలో తొలుత రెవెన్యూ, ఓఎన్జీసీ, పోలీసు ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఆయా గ్రామాల నుంచి మూకుమ్మడిగా ఇవ్వాలని, నిర్ణీత గడువులోగా సంస్థ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరాలని, పనులు కార్యరూపం దాల్చకపోతే ఆందోళన మరింత ఉధృతం చేయాలని సమావేశం పిలుపు నిచ్చింది. సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, మేడిది సరోజ, రాపాక రమేష్‌బాబు, రాపాక ఆనంద్ కుమార్, యెనుముల నాగు, మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీలు చొప్పల బాబూరావు, బైర నాగరాజు, నాయకులు కొల్లాబత్తుల ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన గౌడ సంఘీయులు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై మండలంలోని ఈతకోట గ్రామానికి చెందిన పలువురు గౌడ సంఘీయులు ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేశారు. గ్రామ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సుమారు 60 మంది గౌడ సంఘీయులు వైఎస్సార్ సీపీలో చేశారు. వీరికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, వత్సవాయి కృష్ణంరాజు, పితాని రాంబాబు, వైపీ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు



కుష్ఠు వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో గత పక్షం రోజుల నుంచి కొనసాగుతున్న కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాలు సోమవారం ముగియనున్నాయి. కాకినాడకు చెందిన కుష్ఠు వ్యాధి నిర్మూలన ప్రత్యేక అధికారి సంజీవ్‌రెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి కుష్ఠు వ్యాధి నివారణ–తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామ సచివాలయాల పరిధిలోని ముఖ్య కూడళ్లలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరచారు. మండలంలో రెండు పీహెచ్‌సీల పరిధిలో గతంలో నమోదై ఉన్న 93 కేసుల్లో ఇప్పటి వరకూ రోగులు కోలుకున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్ల కాలంలో కుష్ఠు వ్యాధి రహిత సమాజానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. సూపర్‌వైజర్లు రమణారావు, ఎన్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి తెలిపారు.

నిత్యాన్నదానానికి పలువురి విరాళాలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాదుకు చెందిన గుబ్బల నాగేశ్వరరావు, వీర వెంకట సత్యనారాయణమ్మ దంపతులు రూ.10,116, ఎస్‌బీఐ హైదరాబాద్, భద్రాచలం శాఖ పూర్వ ఉద్యోగులు సంఘం రూ.10 వేలు, విజయవాడకు చెందిన పిశుపాటి వెంకటశేషరవికుమార్ రూ.10 వేలు విరాళం అందించారు. ఈ విరాళాలను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు అందించారు. దాతలకు స్వామి వారి చిత్రపటాలతో పాటు ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, ఉప ప్రధానార్చకుడు మద్దాలి తిరుమలశింగరాచార్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎస్సైగా హరికోటిశాస్త్రి

సఖినేటిపల్లి: స్థానిక పోలీసు స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్సైగా ఆదివారం మలికిపురం ఎస్సై హరికోటి శాస్త్రి బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకూ ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఎ.ఫణిమోహన్ సస్పెండ్ కావడంతో జిల్లా ఉన్నతాధికారులు ఈ నియామకం చేపట్టారు.

వైభవంగా సత్తెమ్మ తీర్థ మహోత్సవాలు



సత్తెమ్మ తల్లి అమ్మవారు



బారులు తీరిన భక్తులు

ముమ్మిడివరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మ దర్శనానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామ ప్రముఖులు మేకల వంశీయులు అమ్మవారికి స్వయం పాకాలు సమర్పించి జాతర మహోత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని సన్నాయిమేళాలు, బాజా భజంత్రీలు, శక్తి వేషధారణలు, మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో అత్యంత ఘనంగా ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు అలరించాయి. అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. తీర్థ మహోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎం.జానకీరామ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.సురేష్ కుమార్, పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

అల్లవరం: మండలంలోని ఓడలరేవు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ తీర్థాన్ని ఏర్పాటు చేశారు.